

సభ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు


ఆకాశంలో కనువిందు చేస్తున్న బెలూన్‌లు


రెపరెపలాడుతున్న 'సిద్ధం' జెండాలు



సీఎం ఫ్లెక్సీలలో స్థానిక నేతలు

బాపట్ల జిల్లా మేదరమెట్ల సమీపంలోని పి.గుడిపాడు వద్ద సీఎం జగన్ హాజరుకానున్న 'సిద్ధం' సభ ఏర్పాట్లు ఇలా.. రాష్ట్రం నలుమూలల నుంచి జనం తరలిరానున్న నేపథ్యంలో సభ వద్ద చేపట్టిన ఏర్పాట్లు ప్రత్యేకతను సంతరించుకున్నాయి.

నేత్రానందంగా శివ పార్వతుల కల్యాణం

- రెండో రోజూ శివాలయాలకు పోటెత్తిన భక్తజనం
- పలు ఆలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు

భట్టిప్రోలు: భట్టిప్రోలులోని శ్రీ కంచి కామాక్షీ సమేత శ్రీ బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వార్ల ఉత్సవ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామోత్సవం నిర్వహించారు. విగ్రహాలను అద్దేపల్లికి చెందిన తిరువీధుల వీర మోహనరావు దంపతులు అందజేశారు. యాజ్ఞిక బ్రహ్మ ఇనమన మెళ్లూరి శ్రీరామచంద్ర శర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం అన్నప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ అర్చకులు వి. సువర్ణాచారి తెలిపారు.

పెదపులివర్రులో వైభవంగా కల్యాణం

భట్టిప్రోలు మండలం పెదపులివర్రులో కొలువైన చరిత్ర ప్రసిద్ధి గాంచిన శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. జగజ్యోతి కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామి వార్లకు గుంటూరు సాంబశివరావు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. శనివారం సాయంత్రం స్వామి వారి రథోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ఉభయదాతగా నూతక్కి నాగేశ్వర రావు వ్యవహరించారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి మేకా సాంబశివరావు, ధర్మకర్తల మండలి చైర్మన్ జంపని అంజయ్య, సభ్యులు పర్యవేక్షించారు. ఆదివారం వసంతోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో అగస్త్య మహర్షిచే ప్రతిష్ఠింపబడిన శ్రీ బాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ అగస్త్యేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. లింగోద్భవ కాలంలో మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు జరిగాయి. స్వామి వార్ల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. కార్యక్రమాలను కార్యనిర్వాహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు.


శ్రీ కంచి కామాక్షీ సమేత శ్రీ బాల కోటేశ్వరస్వామి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలు

సూరేపల్లిలో

మండలంలోని సూరేపల్లిలో కొలువైన శ్రీ కేదారేశ్వర వాయులింగ ఆలయంలో స్వామి వార్లకు శుక్రవారం నుంచి శనివారం వరకు భక్తులు స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. తిరునాళ్ల మహోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

భట్టిప్రోలులో

దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలులోని శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ విశలేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వార్ల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వార్ల కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు తరలి వచ్చారు. కల్యాణ మహోత్సవంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వహణాధికారి దీవి వేంకట అప్పలాచార్యులు పర్యవేక్షించారు.


సూరేపల్లిలో కేదారేశ్వరుని ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

'సిద్ధం'సభను విజయవంతం చేద్దాం

పిట్టలవానిపాలెం: మేదరమెట్లలో ఆదివారం జరగనున్న 'సిద్ధం' సభను విజయవంతం చేయాలనివైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం ఆయన పర్యటించారు. సభకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి గ్రామం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

వేమూరు: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలంలోని పి గుడిపాడు లో జరిగే 'సిద్ధం' సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ఆది వారం జరిగే సభకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల నుంచి వేల సంఖ్యలో ప్రజలు బయలు దేరుతున్నారని చెప్పారు. నియోజక వర్గం నుంచి 230 బస్సులు, 90 కార్లు ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. సభకు వచ్చేవారికి భోజన వసతి కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితుడికి ఈవూరి ఆర్థిక సాయం

నగరం: అగ్ని ప్రమాద బాధితుడికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. నగరం శివారు ఘాలివారిపాలెం గ్రామానికి చెందిన దాసరి దేవదాసుకు చెందిన పూరిల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. విషయం తెలుసుకున్న డాక్టర్ గణేష్ బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ నగదును శనివారం ఈవూరి కుమారుడు డాక్టర్ సృజన్ బాధితుడు దేవదాసుకు అందించారు. నగరం గ్రామ సర్పంచ్ ఇంకొల్లు రామకృష్ణ సిమెంట్ రేకులు, పూడివాడ సర్పంచ్ పాగోలు సుజాత రూ.5 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యం

అమర్తలూరు(వేమూరు): ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరిగిందని ప్రధానోపాధ్యాయులు నిరీక్షణరావు అన్నారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం అంతర్జాతీయ మహిళ దినోత్సవం వేడుకలు నిర్వహించారు. పాఠశాలల్లో పని చేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. మహిళా సాధికారతకు అంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీ విశ్వేశ్వర స్వామి తిరునాళ్ల

ప్రత్యేకత చాటుకున్న తాటి వాసాల రథం

బాపట్లటౌన్: మండలంలోని అప్పికట్ల గ్రామంలో వేంచేసియున్న గంగా అన్నపూర్ణ విశాలక్ష్మీ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో శనివారం రాత్రి తిరునాళ్ళను వైభవంగా నిర్వహించారు. తాటి వాసాలతో తయారు చేసిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 12 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. పలు రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథాన్ని చూసేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దేవాలయం నుంచి రథం అప్పికట్లకు చేరుకుని అక్కడ నుంచి తిరిగి మళ్లీ దేవాలయానికి చేరుకోవటంతో భక్తులు రోడ్లు వెంట కిక్కిరిసి పోయారు. ఈ సమయంలో పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని ట్రాఫిక్‌ను నిలుపుదల చేశారు.


కాశీ విశ్వేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలు

లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు

మహా శివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధ రాత్రి లింగోద్భవ కాలంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల పట్టణ, గ్రామీణ పరిధిలోని శైవ క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తాటి వాసాలతో తయారు చేసిన రథాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు


భక్తులతో కిక్కిరిసిన కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం

వలంటీర్ల సేవలను వినియోగించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రత్నప్రసాద్

చెరుకుపల్లి: బాపట్ల అగ్రికల్చర్ ఇంజినీరింగ్ ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు అందించే సేవలను రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అధ్యక్షుడు మత్తి దివాకర రత్నప్రసాద్ అన్నారు. బాపట్ల ఎన్టీఆర్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ సేవా ప్రత్యేక కార్యక్రమాన్ని మండలంలోని ఆరుంబాక, కావూరు గ్రామ పంచాయతీలలో శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాపట్ల ఎన్‌టీఆర్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జాన్ వెస్లీ అధ్యక్షత వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహించటం వల్ల ఆయా గ్రామాల్లోని యువకుల్లో చైతన్యం వస్తుందని అన్నారు. అగ్రికల్చర్ కళాశాల వారు అందించే సూచనలను రైతులు పాటించి వ్యవసాయంలో మంచి దిగుబడును సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జె వీర ప్రసాద్, డాక్టర్ కె కృపావతి, ఆరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీలు రావూరి సునీత, కొత్తపల్లి సుమలత, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు